


# భజరంగబలి

- డా॥ పి.జె.ఎమ్.శాస్త్రి

**బా**బుగారూ! పిలిచారట." అడిగాడు కాపలా సింగన్న.

"అవునురా! సింగా! రేపు మన వూరి పొలి మేరలోని చింతల వనంలో జరుగబోయే అమ్మోరి జాతరలో నీ కాపలా చాలా జాగ్రత్తగా ఉండాలి. అసలే ఊరికి దూరంగా ఉండే ఈ వనంలో జరిగే జాతరకు ప్రతి సంవత్సరం దొంగల బెడద ఎక్కువగా ఉంటున్నది. ఈ వూరికి పెద్దగా జరిగే కార్యక్రమాలు అన్నీ జాగ్రత్తగా చూచుకునే బాధ్యత నాపైన ఉంది. ఈ సంవత్సరం ఈవనంలో దొంగలు ఎక్కువగా సంచరిస్తున్నట్లు తెలుస్తున్నది. నీవే మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నాకు మాట వస్తుంది."

"అదేటి బాబుగారూ! పతి ఏటా మీరు సెప్పాలేటి? 'నాయాల్డి' నేనుండగా, మీకే దడుపూ అఖ్కరలేదు: 'సిన్న' సీమను కూడా జొరబడనియ్యను, ఆ

పైన మనకు అమ్మోరి దయ ఉండనే ఉంది.''

అది కరెక్టేరా జాతర మొదలవకముందే నీవు 'సుక్క' పడితేగాని మనిషివి కాదు. అందులోనూ రేపు గూడెం జనాలతో కలిసి బాగా ఎక్కించేస్తావుగదా? మందు మత్తులో నీ బాధ్యత నీవు మరచిపోయి. ఎక్కడైనా తొంగున్నావంటే నాకు చెడ్డపేరు వస్తుంది.

లేదు దొరా! మీకు మాట రానిత్తానేటి? మీరు ధరమ పెభువులు. దాని సిగదరగా. నేనుండగా, అదీ అంతమంది జనంలో దొంగోల్లు పడి బతికి బట్టకడతారేటి? అయినా రేపేగదా దొరా! మా సంబరమూ, సంతోసమంతా ఏడాదికి ఒక్కసారి కుసీ చేసుకుంటాం. ఇంకా నేసెప్పొచ్చేదేటంటే దొరా.... అసలు నా సుక్కకీ ఈ కాపలాకి ఏటి సంబంధము లేదు దొరా... దేనికదే. సుక్క పడిందంటే ఒళ్ళు బిగుసుకుపోయి ఇంకా పట్టు పెరుగుద్ది.

సరేరా! వెళ్ళిరా.... ఆ వూరి పెద్ద భూషయ్యగారి ఆజ్ఞ. ఆ రోజు ఆ వూరి ప్రజలకు పెద్ద పండగ. ప్రతి సంవత్సరం ఇదే రోజుల్లో 'నూకాలమ్మ' జాతర జరుపుకోవడం ఆనవాయితీ.

'నూకాలమ్మ' ఆ వూరి పొలిమేర దేవత. చిన్నా, పెద్దా, తారతమ్యం లేకుండా ప్రొద్దుటే లేచి, తలారా స్నానం చేసి, పిల్లా, పెద్దా, బీదా, బిక్కీ మొత్తం క్రొత్త దుస్తులు ధరించి ఆ వూరి పొలిమేర, అడవికి కూడా దగ్గరగా ఉండే చింతల వనంలోని అమ్మోరి విగ్రహం వద్దకు, బారులు తీరిన చీమల్లా బయల్దేరి బాగా తెగబలిసిన మేకపోతు నొకదానిని బాజా భజంత్రీలతో తీసుకువెళ్ళి, దానికి పూజలు చేసి, అక్కడే కల్లు, సారా, వంటి మత్తు పానీయాలు సేవించి, సూర్యాస్తమయం వరకూ డప్పులు వాయించుకుంటూ, ఆ పొలిమేర తల్లి కోసం ప్రత్యేకంగా వారే రచించుకున్న పాటలు భక్తి పారవశ్యంతో పాడుకుంటూ గంతులు వేసుకుంటూ సూర్యాస్తమయంలోగా, మేకపోతును అమ్మోరికి బలి ఇచ్చి, దాని మాంసాన్ని అమ్మోరికి నైవేద్యంగా పెట్టి దాన్ని ప్రసాదంగా స్వీకరించి, తాటాకు మంటలతో మట్టి కుండలలో ఉడికించి, తిని, తర్వాత జాము పొద్దువరకూ సంబరము జరుపుకుని తిరిగి వచ్చేవారు.

అలా చేస్తే తమకెప్పుడూ, ఆ 'నూకాలమ్మ' వారి కటాక్షం ఉంటుందని, సకాలంలో వర్షాలు పడి, పాడి, పంటలతో ఊరంతా నందన వనంలా, ప్రజలంతా పిల్లా పాపలతో సుఖ శాంతులతో వర్థిల్లుతారని వారి ప్రగాఢ, మూఢ నమ్మకం.

అది మారు మూల ప్రాంతం కనుక ఇలాటి ఉత్సవాల్లో అప్పుడప్పుడూ, దొంగల బెడద ఉంటూ ఉండేది. అందుకే ఆ వూరిలో 'సింగన్న' లాంటి వాళ్ళు ఓ ఇద్దరు ముగ్గురు వ్యక్తులు, తుపాకులు, కత్తులు, బరిసెలు లాంటి మారణాయుధాలతో కాపలా కాస్తుంటారు. అందులో సంగన్న ముఖ్యమైన వ్యక్తి, అతి నమ్మకస్తుడు అందుకే 'కాపలా' అతని ఇంటి పేరుగా అందరూ అతన్ని 'కాపలా సంగన్న' అని పిలుస్తారు. సాయంత్రం నాలుగు గంటలు దాటింది. జనసమూహం చీమల బారుల్లా అమ్మోరి వద్దకు చేరుకుంటున్నారు.

అందరిలోనూ కొత్త ఉత్సాహం! అంత మందితో నిండిన ఆ ప్రాంతం అక్కడే ఓ గ్రామం వెలిసినట్టుగా ఉంది.

బాగా రద్దీగా ఉంది. అప్పటికే అక్కడ చేరుకున్న జనంతో...

అక్కడే చిల్లర బేరాలు సాగుతున్నాయి. బేరగాళ్ళ అరుపులు, వాయిద్యాల మ్రోతలు, జానపద పాటలతో, చాలా కోలాహలంగా ఉంది.

అమ్మవారి విగ్రహం అలంకరించారు. పంతులుగారి మంత్రాలతో అమ్మవారి స్తుతి ప్రారంభమయింది. కంచు కంఠంలాంటి పంతులుగారి గొంతు నుండి వినపడే అమ్మవారి శ్లోకాలతో ఒళ్ళు పులకరించి పోతోంది.

అమ్మవారికి ఎదురుగా అదే ఎత్తులో ఒక బండి కట్టారు. ఆ బండిపైన 'బలి' ఇవ్వవలసిన మేక పోతు భర్త చనిపోయిన తర్వాత పదవ రోజు చివరిసారిగా పసుపు, కుంకుమలతో అలంకరించిన ముత్తైదువులా ఉంది మేకపోతు.

దానికి ఒక ప్రక్కన డప్పు వాయిద్యాల మ్రోతకు అది పారి పోకుండా పట్టుకున్న సింగన్న కొడుకు 'భజరంగడు'

బండికి ఎదురుగా అల్లంత దూరంలో ఒక బొడ్లో కత్తిని, మరో బొడ్లో 'తూటాల'తో నింపబడియున్న తుపాకిని, తగిలించుకుని, తన కాపలాలో నిమగ్నమై చుట్టూ పరికించి చూస్తున్న సింగన్న.

చుట్టూ సంబరాన్ని తిలకించగా వచ్చిన, గ్రామ పెద్దలు, ఆడామగా వగైరా!

మేకపోతుకు కుంకుమ బొట్లు పెట్టారు. (వేప మండ'లు కట్టారు సాంబ్రాణి ధూపం వేశారు.)

డప్పు వాయిద్యాలు 'ఢం, ఢం' అని ఢమక శబ్దాలు చేస్తున్నాయి.

బండి ఎదురుగా సింగన్నతో సహా అప్పటికే చాలా మంది తాగిన మైకంలో తెలియని అనుభూతిని పొందుతున్నారు. అమ్మోరి ముందు ప్రజల 'విలయ తాండవం' మైకం ఎక్కువైపోయి భక్త ప్రజల 'మతులు' తప్పుతున్నాయి. వాయిద్యాల 'శృతులు' తప్పుతున్నాయి.

పైన చుట్టు ప్రక్కన కూర్చున్న పెద్దలంతా సంబరాన్ని చూస్తు 'అంబర' మెక్కినంత ఆనందపడుతున్నారు.

సూర్యాస్తమయం కావస్తోంది. జనంలో ఉత్సాహం రెట్టింపు అయింది.

ఈ ఉత్సవాన్ని చూసే అదృష్టం లేక తప్పని సరియై కొండ క్రిందకు వెళ్తున్నట్టుగా నీరసంగా కిరణాలను ప్రసరిస్తోంది సూర్యగోళం.

మేకపోతును బలి ఇచ్చే టయిం దగ్గర పడుతోంది. జన నమూహం ఆగలేదు! గెంతుతున్నారు. త్రాగుతున్నారు.

తాగిన మైకంలో త్రొక్కిసలాట ప్రారంభమయింది. ఒకరినొకరు నెట్టుకుంటున్నారు. క్రిందా మీదా పడుతున్నారు త్రొక్కిసలాట మరీ ఎక్కువయింది. ఆగలేదు. అమ్మోరి ఎదురుగా బండి వరకూ సాగింది.

అందులో విసురుగా వచ్చి సింగన్నను తగిలా రెవరో! మైకంలో ఒళ్ళు తెలియని సింగన్న వెల్లికిలా పడిపోయాడు 'అమ్మా' అంటూ ప్రక్కకు ఒత్తిగిలాడు. అంతే తూటాలతో నింపబడియున్న తుపాకీ, వత్తిడికి బటన్ నొక్కుకుని ధన్! ధన్!! మంటూ శబ్దం చేస్తు ప్రేలింది.

ప్రేలిన తూటాలు! ఎదురుగా బండిమీద మేకపోతును ఒడిసి పట్టుకుని యున్న సంగన్న కొడుకు 'భజరంగని' గుండెల్లోంచి దూసుకుపోయాయి!

ఓ క్షణం పాటు కాలం స్తంభించిపోయింది.

భజరంగడు నేలకు ఒరిగాడు.

పట్టు వదిలించుకున్న మేకపోతు బ్రతుకు జీవుడా! అంటూ పారిపోయింది జనంలోకి దూకి.

అనుకోకుండా జరిగిన ఈ సంఘటనతో జరిగిపోయింది అమ్మోరికి 'భజరంగబలి' మైకం నుండి తేరుకున్న సింగన్న భోరు, భోరున విలపించాడు.

అంది వచ్చిన కొడుకుని అందుకుని పోయిన అమ్మోరిని దూషించాడు.

త్రాగిన మత్తులో తనకొడుకు ప్రాణాలు తనే 'నిలువునా తీసుకున్నాడు.'

గుండెల్లో రంపపు కోత! చెదిరిన తన తలవ్రాత జోహార్లతో అదే బండి మీద తన కొడుకుని వెనక్కి తీసుకు వచ్చి అంత్యక్రియలు జరిపించాడు.

తర్వాత! ఇదంతా అమ్మోరి చలవేనని, తన కొడుకు అమ్మోరి సన్నిధికి వెళ్ళిపోయాడని సరిపెట్టుకున్నాడు, అమాయకుడు సింగన్న.

మరుసటి సంవత్సరం నుండీ కనీసం మేకపోతును కూడా బలి యివ్వడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు.

అక్కడి ప్రజల మూఢ నమ్మకానికి జరిగిన 'భజరంగబలి'లో ఆ రోజునుండి ఆ వూరిలో త్రాగుడు నిషిద్ధమయింది. ❋